# సాక్షి

## డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

గురువారం । 30 । మే । 2024






**రూ.1,01,116 విరాళం**

సఖినేటిపల్లి:అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలోని నిత్య అన్నదాన ట్రస్టుకు అప్పన చంద్రరావు (గుడిమెల్లంక) రూ.1,01,116 విరాళం అందజేశారు.



**నిత్యాన్నదాన పథకానికి రూ.1,01,116**

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి కర్రి వేంకట శ్రీనివాసరెడ్డి దంపతులు (అనపర్తి) రూ.1,01,116 విరాళాన్ని సమర్పించారు.

గరిష్టం/కనిష్టం 43.0°/31.0°

| | గరిష్టం | కనిష్టం |
|---|---|---|
| రాజమహేంద్రవరం | 43.0 | 30.0 |
| కాకినాడ | 39.9 | 29.4 |
| అమలాపురం | 41.0 | 31.0 |

## న్యూస్‌రీల్

### వెబ్ కౌన్సెలింగ్‌కు 63 మంది హాజరు

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం వైవీఎస్ అండ్ బీఆర్ఎం కళాశాలలో జరిగిన పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్‌కు బుధవారం 63 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.విశాల తెలిపారు. 27001 ర్యాంకు నుంచి 43000 ర్యాంకు వరకూ వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. గురువారం 43001 నుంచి 59000 ర్యాంకు వరకూ వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు.

### ప్రతి విద్యార్థికి 'విద్యాకానుక'



మనబడి నాడు-నేడు పనులపై సమీక్షిస్తున్న ఏపీసీ మధుసూదనరావు

రాయవరం: వచ్చే నెల 12న పాఠశాలల పునః ప్రారంభం రోజునే ప్రతి విద్యార్థికి విద్యాకానుక అందజేసే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారని డిప్యూటీ కలెక్టర్, సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు తెలిపారు. రాయవరం మండలంలో శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యాకానుక-5 స్టాక్ పాయింట్‌ను ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 22 మండలాల్లో స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేయడంతో పాటు, విద్యాకానుక-5 స్టాక్‌ను సక్రమంగా, సమర్థవంతంగా పాఠశాలలకు చేరవేసేందుకు ప్రతీ కాంపానెంట్‌కు ఒక కమిటీని ఏర్పాటు చేశామన్నారు. అలాగే పాఠశాల స్థాయిలో కూడా కమిటీల ఏర్పాటుకు ఉత్తర్వులు ఇచ్చామని అన్నారు. జిల్లాలో మండల స్టాక్ పాయింట్లకు పూర్తి స్థాయిలో నోట్ బుక్, బెల్టులు చేరుకున్నాయన్నారు. సింగిల్ రూల్, బ్రాడ్ రూల్, వైట్ 6.62లక్షల నోట్ పుస్తకాలు, 66,549 బెల్టులు చేరుకున్నాయన్నారు. దశలవారీగా పాఠ్య పుస్తకాలు మండల స్టాక్ పాయింట్లకు చేరుకుంటున్నాయన్నారు.

51,897 మంది బాలికలకు 47,729 మంది బాలురకు షూలు, 11,557 ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు, 99,232 వంతున యూనిఫామ్, స్కూల్ బ్యాగ్స్ మండల స్టాక్ పాయింట్లకు చేరుకోవాల్సి ఉందన్నారు. రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి వచ్చిన సమాచారం మేరకు జూన్ 5వ తేదీ నాటికి పూర్తి స్థాయిలో మెటీరియల్ చేరుతుందన్నారు. మండల విద్యాశాఖాధికారులు పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణలకు పలు సూచనలు ఇచ్చారు. అంతకు ముందు ఆయన మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పాఠశాల హెచ్ఎంలతో మనబడి నాడు-నేడు పనులపై సమీక్షించారు. ఆయన వెంట సమగ్ర శిక్షా సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏఎంవో పి.రాంబాబు, సైట్ ఇంజినీర్ సూర్యనారాయణ, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ ఎస్.రామారావు, అకౌంటెంట్ సత్యనారాయణ తదితరులున్నారు.

గత ఏడాది జూలై.. ఆగస్టు నెలల్లో కూనవరం స్ట్రైట్‌కట్ (మొగ) ద్వారా సముద్రంలోకి ముంపునీరు ఇలా దిగుతోంది. ఈ మొగ ద్వారా అమలాపురం, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం మండలాలకు చెందిన సుమారు 20 వేల ఎకరాల వరి ఆయకట్టు, పది వేల ఎకరాల ఆక్వా చెరువుల ముంపునీరు సముద్రంలోకి దిగాల్సి ఉంది. నీరు ఈ విధమైన ప్రవాహంతో దిగితేనే చేలు ముంపుబారిన పడవు.



కూనవరం మొగ ద్వారా సముద్రంలోకి వెళ్తున్న ముంపునీరు (ఫైల్)

కూనవరం స్ట్రైట్‌కట్ వద్ద సాధారణంగా వేసవిలో పరిస్థితి ఇది. మొగ చాలా వరకు మూసుకుపోయి ముంపునీరు పెద్దగా దిగదు. వర్షాలు లేకపోవడం, వేసవిలో సాగు లేక ముంపు నీరు కూనవరం మేజర్ డ్రెయిలో చాలా తక్కువ పారుతోంది. ఆక్వా చెరువుల నుంచి వచ్చిన నీరు, మొగ ద్వారా ఆటుపోటు సమయంలో వచ్చే సముద్రం నీరు తిరిగి వెళ్లిపోతోంది. ఇలా ఉన్న మొగను డ్రైనేజీ శాఖ అధికారులు జూలై నెలలో డ్రెడ్జింగ్ చేసి తెరుచుకునేలా చేస్తుంటారు.



గతంలో వేసవి సమయంలో తక్కువగా తెరుచుకున్న కూనవరం స్ట్రైట్‌కట్

కూనవరం స్ట్రైట్‌కట్ వద్ద ఈ ఏడాది పరిస్థితి. చూస్తే ఎడారిని తలపిస్తోంది. డ్రెయిన్ నుంచి సముద్రంలో కలిసే చోట సుమారు అర కిలోమీటరు మేర ఇసుక తిన్నెలు వేసేసింది. గతంలో కన్నా ఈ ఏడాది మట్టి మరింత పేరుకుపోయింది. డ్రెయిన్ కన్నా సముద్ర మొగ వద్ద మూడునాలుగు అడుగుల ఎత్తున ఇసుక మేటలు వేయడంతో ఈ ఏడాది వర్షాకాలం డ్రెడ్జింగ్ కూడా కష్టమే. ముందు భారీగా ఇసుక తవ్వకాలు చేసి తరువాత డ్రెడ్జింగ్ చేయాల్సి వస్తోందని అధికారులు అంచనా వేస్తున్నారు.



కూనవరం స్ట్రైట్‌కట్ వద్ద ఇసుక మేటలు

# మొగమాటం ఏంటో!?

- మూసుకుపోయిన కూనవరం స్ట్రైట్‌కట్
- అదే బాటలో రామేశ్వరం మొగ
- పెద్ద ఎత్తున వేసిన ఇసుక మేటలు
- ఖరీఫ్ వేళ 50 వేల ఎకరాలకు ఇబ్బంది
- మొగ మూసుకపోయి ఎండిపోతున్న సాంప్‌లు
- మత్స్య సంపదకు అవాంతరం
- ఏటా డ్రెడ్జింగ్‌తో సరిపెడుతున్న అధికారులు
- శాశ్వత చర్యలకు ఇబ్బందేమిటో మరి!

**సాక్షి, అమలాపురం/ఉప్పలగుప్తం :** మధ్యడెల్టాలో ఖరీఫ్‌కు ప్రధాన అవరోధం 'ముంపు'. కొద్దిపాటి వర్షానికే వేల ఎకరాల్లో చేలు ముంపునకు గురవుతున్నాయి. ముమ్మిడివరం, అమలాపురం, పి.గన్నవరం, రాజోలు వ్యవసాయ సబ్ డివిజన్ల పరిధిలో భారీ వర్షాలు, తుపాన్లకు ఏటా వేల ఎకరాల్లో పంట నష్టపోతున్నారు. ముమ్మిడివరం, ఉప్పలగుప్తం, అమలాపురం, కాట్రేనికోన మండలాల్లో ఆయకట్టు ముంపునకు కూనవరం స్ట్రైట్‌కట్ కారణమవుతోంది. అలాగే అమలాపురంతో పాటు ఉప్పలగుప్తం, అమలాపురం మండలాల్లో ముంపునీరు దిగాల్సి ఉంది. ఈ రెండు మొగల ద్వారా సుమారు 50 వేల ఎకరాల ఆయకట్టు ముంపు నీరు సముద్రంలో కలుస్తోంది. ఇప్పుడు ఈ రెండు మొగలు మూసుకుపోయాయి. వేసవిలో ఇది సహజమే అయినా ఈ ఏడాది మొగల వద్ద పెద్ద ఎత్తున ఇసుక మేటలు వేశాయి.

**శాశ్వత పరిష్కారమే శరణ్యం**

కూనవరం, రామేశ్వరం మొగలు పూడుకుపోకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఆయకట్టు రైతులు దశాబ్దాలుగా కోరుతున్నారు. 2002 నుంచి అంటే సుమారు 22 ఏళ్ల నుంచి తాత్కాలిక పనులు తప్ప శాశ్వత చర్యలు లేవు. పూడుకుపోయినప్పుడల్లా డ్రెడ్జింగ్ చేసి మమ అనిపిస్తున్నారు. వీటి పరిష్కారానికి ముంబాయి చెందిన ఓషనోగ్రఫీ అధికారులు మొగకు ఇరువైపులా డ్రెయిన్ నుంచి సముద్రంలోకి గ్రోయిన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు చేశాయి. కానీ దీనిపై సాగునీటి పారుదల శాఖ అధికారులు భిన్నాభిప్రాయం వ్యక్తం చేశారు. కొంత మంది మాత్రం కూనవరం, రామేశ్వరం మొగలను అనుకుని ఉన్న పర్రభూముల (సాంప్)లో ఆక్రమణలు తొలగించాలని కోరుతున్నారు. సుమారు ఆరు వేల ఎకరాల విస్తీర్ణంలో సహజ సిద్ధంగా ఏర్పడిన పర్రభూములను ఆక్రమించి కొందరు ఆక్వా సాగు చేస్తున్నారు. దీని వల్ల పర్రభూములు కుదించుకుపోయాయి. లేకుంటే ఈ పర్రభూములలోకి ముంపునీరు చేరి నదుల ద్వారా సముద్రంలో కలిసేది. అలాగే పర్రభూముల నుంచి సముద్రంలోకి నీరు దిగేలా పలుచోట్ల గండ్లు కొట్టాలని అప్పుడు వేగంగా ముంపునీరు సముద్రంలో దిగుతుందని వారు తేల్చారు. ఈ కార్యాచరణ రూపొందించడంలో అధికారులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. రెండు దశాబ్దాలుగా కేవలం డ్రెడ్జింగ్, ఇసుక మేటల తొలగింపు వంటి తాత్కాలిక పనులను మాత్రం చేస్తున్నారు. దీని వల్ల ఆయకట్టు రైతులకు పెద్దగా ప్రయోజనం కలగడం లేదు.



కూనవరం మొగ



అల్లిపర్రలో జోరుగా సాగుతున్న వేట (ఫైల్)

**మత్స్య సంపదకు కోత**

చేపల వేట నిషేధంతో తీర ప్రాంత మత్స్యకారులు ప్రత్యామ్నాయ పద్ధతిలో పర్రభూములలో వేట సాగిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. అల్లిపర్ర మీద రాఘవులపేట, ఎస్.కొత్తపల్లికి చెందిన మత్స్యకారులు, చిర్రయానాం పర్రభూమి మీద చిర్రయానాం, గచ్చకాయల పోర, పల్లం, నీళ్లరేవుకు చెందిన వారు, ఎస్.యానాం పర్రమీద ఎస్.యానాం మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. పర్ర భూముల్లో కొయ్యింగ, కట్టి పరిగెలు, కడిసెలు, మాతలు, టైగర్ రొయ్యలు, తెల్ల రొయ్యలు దొరుకుతుంటాయి. ఈ పర్ర భూముల మీద రోజుకు కనీసం రూ.పది లక్షల విలువైన మత్స్య సంపద లభ్యమవుతుందని అంచనా. మొగల నుంచి సముద్రపు నీరు రాకపోవడంతో మత్స్యసంపద తగ్గిపోతోందని మత్స్యకారులు వాపోతున్నారు.



మొగ ద్వారా నీరు రాకపోవడంతో పూడుకుపోయిన అల్లిపర్ర

### మత్స్య సంపద తగ్గిపోతోంది



పర్రభూమిలోకి సముద్రపు నీరు రాకపోవడంతో ఇవి చాలా వరకు పూడుకుపోయాయి. అల్లిపర్ర చాలా వరకు ఎండిపోయింది. ఇక్కడ వేట చేయడం ద్వారా రోజుకు కనీసం రూ.500 నుంచి రూ.600 వరకు ఆదాయం వచ్చేది. ఇప్పుడా సంపాదన లేదు.

– అరదాని రాజు, మత్స్యకారుడు, ఎస్.కొత్తపల్లి, ఉప్పలగుప్తం మండలం

### శాశ్వత పరిష్కారం చూపాలి



మొగలకు శాశ్వత పరిష్కారం చూపించాలి. గ్రోయిన్లు కట్టడం, సాంప్‌లలో ఆక్రమణలు తొలగించడం, డ్రెయిన్లలో పూడిక తొలగింపు, గుర్రపుడెక్క తీయడం వంటి పనులు ఒక పద్ధతిలో చేయాలి. అప్పుడు ముంపునీరు ఎటువంటి సమస్య లేకుండా దిగుతుంది. గతంలో భారీ వర్షాలు కురిస్తే రెండు, మూడు రోజులు చేలు ముంపు నీటిలో ఉన్నా ఇబ్బంది లేదు. ఇప్పుడు వారం, పది రోజులు చేలు మునిగిపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారు.

– సత్తి శ్రీనివాస్, గోదావరి ప్రాజెక్టు కమిటీ మాజీ వైస్ చైర్మన్, నరవప్పాలెం, అమలాపురం మండలం

# ఈసీఐ నిబంధనల మేరకు ఏర్పాట్లు

కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపుపై కలెక్టర్ హిమాన్షు శుక్లా

**అమలాపురం రూరల్:** అమలాపురం పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి జూన్ నాలుగో తేదీన జరిగే ఓట్ల లెక్కింపునకు ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా కౌంటింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా తెలిపారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా 26 జిల్లాల కలెక్టర్లతో అమరావతి నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఓట్ల లెక్కింపు కేంద్రాల సన్నద్ధతపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా శుక్లా మాట్లాడుతూ పారదర్శకంగా ఓట్ల లెక్కింపు సాగేలా పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వెయ్యి మందికి పైగా కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, సూక్ష్మ పరిశీలకులు తదితరులతో పాటు దాదాపు 400 మంది ఇతర సిబ్బంది కౌంటింగ్, అనుబంధ విధుల్లో పాల్గొంటారని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం రిటర్నింగ్ అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియను సమష్టి కృషితో విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. రౌండ్ల వారీగా ఓట్ల లెక్కింపు, జాప్యం లేకుండా ఫలితాల వెల్లడికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. మీడియా కేంద్రం వద్ద ప్రింట్ అండ్ ఎల్రక్టానిక్ మీడియా ప్రతినిధులకు తాజా సమాచారాన్ని ప్రతి రౌండ్‌కూ సకాలంలో అందించాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ తెరిచేందుకు కౌంటింగ్ ఏజెంట్లు ఉదయం 5.30గంటలకు లెక్కింపు కేంద్రానికి హాజరుకావాలన్నారు. ఏజెంట్లు పెన్ను, పెన్సిల్, 17సీ ఫారం, తెల్లకాగితం మాత్రమే తీసుకురావాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. ఈవీఎంలోని ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కించడానికి వేర్వేరుగా టేబుల్‌లను ఏర్పాటు చేశామన్నారు. జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని, ఫలితాల తర్వాత ఊరేగింపులు, విజయోత్సవ ర్యాలీలకు అనుమతులు తప్పనిసరని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు అడ్మిన్ ఎస్పీ ఎస్.ఖాదర్ బాషా, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, జి. కేశవవర్ధన రెడ్డి, వి.మదన్‌మోహన్ రావు, డీవీఎస్ ఎల్లారావు, ఎ.శ్రీరామచంద్రమూర్తి, జీవీవీ సత్యనారాయణ, పార్లమెంట్ సహాయ రిటర్నింగ్ అధికారి ఎం.ఝాన్సీ రాణి ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా. చిత్రంలో ఎస్పీ శ్రీధర్ తదితరులు

# పాసులుంటేనే అనుమతి

ఎస్పీ సుసరాపు శ్రీధర్

**అమలాపురం టౌన్:** చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ప్రవేశానికి విధిగా పాస్ ఉండాలని ఎస్పీ సుసరాపు శ్రీధర్ సూచించారు. అలాగే వివిధ పార్టీల అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్ల వాహనాలు నిర్దేశిత ప్రాంతంలోనే నిలపాలన్నారు. లెక్కింపు కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన మూడంచెల భద్రత, నిఘాను ఎస్పీ శ్రీధర్ ఎన్నికల సంఘానికి, పోలీసు ఉన్నతాధికారులకు బుధవారం నివేదించారు. పలు ప్రాంతాల్లో పోలీసు అధికారులు క్యాసో తనిఖీలు, దాడులు బుధవారం నిర్వహించారు. ఈ దాడులు, తనిఖీల వివరాలను ఎస్పీ కార్యాలయం బుధవారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపింది.

- అల్లవరం శివారు సడక్ రోడ్డు వద్ద పేకాడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.28,300 నగదు సీజ్ చేశారు.
- ఐ.పోలవరం మండలం జి.మూలపొలంలో ఒక వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 2 లీటర్ల నాటుసారా, ఒక మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నారు.
- రావులపాలెం మండలం ముమ్మిడివరప్పాడు, రాయవరం మండలం కూర్మాపురం, రామచంద్రపురం మార్కెట్ సెంటర్, అమలాపురం మున్సిపల్ కాలనీ, ఐ.పోలవరం మండలం పశువుల్లంక ప్రాంతాల్లో పోలీసు అధికారులు స్థానిక రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలతో అవగాహన సదస్సులు నిర్వహించి ఓట్ల లెక్కింపు రోజున అమలయ్యే బందోబస్తు గురించి వివరించారు.



బందోబస్తుపై అవగాహన కల్పిస్తున్న పట్టణ సీఐ క్రిస్టోఫర్

# భవితకు దివ్యమైన ప్రణాళిక

- గడప గడపకూ వెళ్లి భవిత కేంద్రాల ఐఈఆర్టీల సర్వే
- ప్రత్యేక అవసరాల చిన్నారుల గుర్తింపు
- సమగ్ర శిక్ష ద్వారా ప్రభుత్వ పథకాల పంపిణీకి కృషి

**రాయవరం:** అన్ని అవయవాలు సక్రమంగా ఉండి, ఆరోగ్యంగా ఉన్న చిన్నారులు వారి అనుభూతులను తల్లిదండ్రులతో పంచుకుంటారు. దివ్యాంగులైన చిన్నారులు మాత్రం వారి ఆనందాన్ని, కష్టాలను, అనుభూతులను పూర్తి స్థాయిలో వ్యక్తం చేయలేరు. ప్రభుత్వం అటువంటి ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను కూడా మిగిలిన చిన్నారులతో సమానంగా చూడాలని చేస్తున్న ప్రయత్నం సత్ఫలితాలనిస్తోంది. ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు మిగిలిన చిన్నారుల మాదిరిగానే అన్ని అవకాశాలను అంది పుచ్చుకునేలా ప్రతి మండలానికి ఒక భవిత కేంద్రాన్ని ఏర్పాటు చేసి, సహిత విద్యను ప్రవేశ పెట్టింది. ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు ఇంటికే పరిమితం కాకుండా మానసికంగా, శారీరకంగా ఎదిగేందుకు ఈ భవిత కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. సమాజంలో ఇంకా మిగిలి ఉన్న ప్రత్యేక అవసరాలు ఉన్న చిన్నారులను గుర్తించడానికి భవిత కేంద్రాల ఐఈఆర్పీ( ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్)లు సర్వే చేస్తున్నారు. ఇంక్లూజన్-2025లో భాగంగా దివ్యాంగ చిన్నారులందరికీ వారికి అవసరమైన విద్యను అందించడం, ప్రతి చిన్నారిని వారి వయసుకు తగ్గట్టుగా పాఠశాలలో చేర్పించడమే లక్ష్యంగా ఈ సర్వే నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే దివ్యాంగ చిన్నారుల విద్యను డిజిటలైజేషన్ చేసి, ట్యాబ్‌లను అందజేశారు.



ముమ్మిడివరంలో ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల గుర్తింపునకు సర్వే చేస్తున్న ఐఈఆర్టీ రమాదేవి

**మండలాల వారీగా గుర్తించిన ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల వివరాలు ఇలా..**

| మండలం | చిన్నారులు |
|---|---|
| అయినవిల్లి | 09 |
| ఆలమూరు | 08 |
| అల్లవరం | 10 |
| అమలాపురం | 06 |
| అంబాజీపేట | 07 |
| ఆత్రేయపురం | 12 |
| ఐ.పోలవరం | 06 |
| కె.గంగవరం | 10 |
| కపిలేశ్వరపురం | 04 |
| కాట్రేనికోన | 10 |
| కొత్తపేట | 09 |
| మలికిపురం | 12 |
| మామిడికుదురు | 16 |
| మండపేట | 09 |
| ముమ్మిడివరం | 23 |
| పి.గన్నవరం | 09 |
| రామచంద్రపురం | 10 |
| రావులపాలెం | 11 |
| రాయవరం | 14 |
| రాజోలు | 13 |
| సఖినేటిపల్లి | 15 |
| ఉప్పలగుప్తం | 09 |

### ప్రత్యేక వైద్య శిబిరాలు

సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మార్చి, ఏప్రిల్ నెలల్లో మెడికల్ అసెస్‌మెంట్ క్యాంపులు ఏర్పాటు చేశారు. రావులపాలెం, రామచంద్రపురం, ముమ్మిడివరం, రాజోలు, అమలాపురంలలో ఏర్పాటుచేసిన శిబిరాల్లో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అవసరమైన ఉపకరణాలను గుర్తించి, వాటి కోసం దరఖాస్తులు స్వీకరించారు. వారిని ప్రత్యేక వైద్య నిపుణులతో పరీక్షలు చేయించి వారికి ఎటువంటి పరికరాలు అవసరమో గుర్తించారు. ఈ విధంగా సుమారు 800 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన వారిని గుర్తించారు. వీరిని మెంటల్లీ రిటార్డెడ్ (ఎంఆర్), హియరింగ్ ఇంపైర్డ్ (హెచ్ఐ), విజువల్లీ ఇంపైర్డ్ (వీఐ), సెరిబ్రల్ పాలసీ కింద నాలుగు విభాగాలుగా విభజించారు. ఈ శిబిరాల్లో పాఠశాలలకు రాకుండా ఇంటి వద్ద ఉండేవారు కూడా వచ్చారు. ఇలా పాఠశాలలకు రాని ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు ఉన్నారని గుర్తించి, ఇటువంటి వారి కోసం సర్వే ప్రారంభించారు.

**సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా**

ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు ఇంటికే పరిమితం కాకుండా.. మానసికంగా, శారీరకంగా అభివృద్ధి చెందేందుకు ఏర్పాటు చేసిన భవిత కేంద్రాల ద్వారా అవసరమైన చర్యలను సమగ్ర శిక్షా అభియాన్ తీసుకుంటోంది. మానసిక దివ్యాంగుల్లో విద్యార్థి దశలో ఉన్నవారికి విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటుగా, ప్రతివారం ఫిజియోథెరపీ సేవలను అందజేస్తున్నారు. వీరిలో అవసరమైన పరికరాలను అందించడానికి చర్యలు చేపడుతున్నారు. ప్రత్యేక అవసరాలు గల వారిని గుర్తించి, వారి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించడం, పాఠశాలలకు రప్పించేలా భవిత కేంద్రంలోని ఐఈఆర్పీలు చర్యలు తీసుకుంటున్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి ప్రతి మండలంలో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను గుర్తించేందుకు ఐఈఆర్పీలు ప్రత్యేక సర్వే చేపడుతున్నారు.


**జిల్లాలో 22 భవిత కేంద్రాలు**

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 22 భవిత కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలో 2,586 మంది ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు ఉన్నారు. వీరిలో అవసరమైన వారికి వారంలో ఒకరోజు ఫిజియోథెరపీ సేవలను అందిస్తున్నారు. వీరు కాకుండా, గతేడాది జూన్‌లో నిర్వహించిన సర్వేలో పాఠశాలలకు రాకుండా ఇంటి వద్ద ఉన్న వారిని గుర్తించేందుకు సర్వే చేస్తున్నారు. సర్వే అనంతరం వారి వయసుకు తగిన విధంగా, అంగన్‌వాడీ కేంద్రం లేదా ప్రాథమిక పాఠశాలల్లో వారిని చేర్పిస్తారు. ఈ ఏడాది సెలవు రోజుల్లోనే సర్వే చేయాలని అధికారులు ఐఈఆర్పీలను ఆదేశించారు. స్థానిక అంగన్వాడీ వర్కర్లు, ఏఎన్ఎంలు, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్ల సహాయంతో సర్వే చేపడుతున్నారు.

**నాలుగు రకాల అలవెన్స్‌లు**

ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు నాలుగు రకాల అలవెన్సులను ప్రభుత్వం అందజేస్తుంది. ఎస్కార్ట్, ట్రాన్స్‌పోర్ట్, హోమ్ బేస్డ్, రీడర్ అలవెన్స్‌లను అందజేస్తున్నారు. అంధులైన చిన్నారులకు రీడర్ అలవెన్స్ కింద రూ.200 చొప్పున 10 నెలలకు ఒకసారి రూ.2000 అందజేస్తున్నారు. బడికి వచ్చే వారికి ఎస్కార్ట్ అలవెన్స్ కింద ఒక్కో విద్యార్థికి నెలకు రూ.300 వంతున పది నెలలకు రూ.3,000 అందిస్తున్నారు. అలాగే ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ కింద ఒక్కో విద్యార్థికి రూ.300 వంతున పది నెలలకు రూ.3,000 అందజేస్తున్నారు. బాలికలకు ప్రత్యేకంగా గర్ల్ చైల్డ్ అలవెన్స్ కింద ఒక్కో విద్యార్థినికి రూ.200 వంతున 10 నెలలకు రూ.2000 ఇస్తున్నారు. హోమ్ బేస్డ్ అలవెన్స్ కింద బడికి రాకుండా ఇంటి వద్ద ఉంటూ విద్య నేర్చుకునే ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు నెలకు రూ.300 వంతున పది నెలలకు రూ.3,000 అందజేస్తున్నారు. అలాగే బడికి వెళ్లే వారికి పాఠశాలల్లో అందరు విద్యార్థులతో పాటు వీరికి విద్యాకానుకలో భాగంగా యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగ్, బెల్టు తదితర సామగ్రిని అందజేస్తున్నారు. అమ్మఒడి పథకాన్ని కూడా వీరికి వర్తింపజేస్తున్నారు.


### ప్రతి ఒక్కరినీ గుర్తించేందుకే



జిల్లాలో ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల్లో ప్రతి ఒక్కరినీ ఈ పథకం కిందకు తీసుకురావాలనే ఉద్దేశంతో రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వే ప్రారంభించాం. సర్వే ముమ్మరంగా సాగుతోంది. ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు వారి అవసరాల మేరకు విద్యను అందిస్తున్నాం. భవిత కేంద్రాలకు రాని వారికి హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్‌ను అందిస్తున్నాం. ఎక్కడా సిబ్బంది కొరత లేదు.

– ఎంవీవీ సత్యనారాయణ, సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్, అమలాపురం

### అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు



ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను సాధారణ విద్యార్థులతో సమానంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు భవిత కేంద్రాలు దోహదపడుతున్నాయి. ఈ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలతో కూడిన విద్యను అందజేస్తున్నారు. బడికి వచ్చే అవకాశం ఉన్న ప్రతి చిన్నారిని, భవిత కేంద్రానికి రప్పించి విద్యను అందించడం ప్రధాన ఉద్దేశం. ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు అవసరమైన పరికరాలను అందజేస్తున్నాం. ఇప్పటి వరకు 232 మంది ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను గుర్తించాం.

– ఎ.మధుసూదనరావు, డిప్యూటీ కలెక్టర్, అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్, సమగ్ర శిక్షా, అమలాపురం

## క్లుప్తంగా

### రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


శ్రీనివాస్ (ఫైల్)

**తాళ్లపూడి:** మండలంలోని సూర్యపేట రోడ్డులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. తాళ్లపూడి ఎస్సై టి.శ్యామ్‌సుందర్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని గజ్జరం నుంచి సూరయ్యపేట వెళ్లే రహదారిలో కొవ్వూరు మండలం చిడిపి గ్రామానికి చెందిన బండారు శ్రీనివాస్ (25), ప్రక్కిలంక గ్రామానికి చెందిన డేరా లక్ష్మణ్ బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందగా, లక్ష్మణ్‌కు గాయాలయ్యాయి. స్థానికులు స్థానిక స్టార్ ఆస్పత్రికి తరలించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి సాయి ఆస్పత్రికి తరలించారు. లక్ష్మణ్, ఆస్పత్రి వర్గాల సమాచారంతో కేసు నమోదు చేసినట్టు ఎస్సై శ్యామ్ సుందర్ తెలిపారు.

### దివ్యాంగురాలిపై అత్యాచారం

**అంబాజీపేట:** ఒక మానసిక దివ్యాంగురాలిపై 55 ఏళ్ల వృద్ధుడు అత్యాచారం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు చిరతపూడి శివారు కట్టావారిపాలేనికి చెందిన 25 ఏళ్ల ఆ యువతి ఈ నెల 26వ తేదీ రాత్రి అమ్మవారి జాతర సందర్భంగా ఇరుగు పొరువారి వద్ద నుంచి బిర్యాని, కూర తెచ్చుకుందామని బయటకు వెళ్లింది. ఇదే అదునుగా భావించిన అదే ప్రాంతానికి చెందిన 55 ఏళ్ల కట్టా పాటియ్య అక్కడికి పక్కనే ఉన్న తోటలోకి తీసుకుపోయి అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో ఆమె బిగ్గరగా వేయడంతో అటుగా వెళుతున్న మహిళలు స్థానికులకు సమాచారం ఇచ్చారు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### మొరాయించిన రైల్వే గేటు

**మండపేట:** అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం కేశవరం రైల్వే గేటు సాంకేతిక లోపంతో బిగుసుకుపోయింది. దాంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బంది పడ్డారు. బుధవారం రాత్రి సుమారు 8.15 గంటల సమయంలో గూడ్స్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు రావడంతో రైల్వే గేట్ వేశారు. రైళ్లు వెళ్లిన అనంతరం అవి తెరుచుకోకుండా మొరాయించాయి. అర్ధరాత్రి దాటినా గేటు తెరుచుకోలేదు. గేట్‌మన్ ఉన్నతాధికారులకు సమాచారాన్ని ఇచ్చి గేటు మూత పడిందంటూ తాత్కాలికంగా అటు ఇటు బోర్డులు ఏర్పాటు చేశారు. ఇక చేసేది లేక ఇటు కడియం మీదుగా రాజమహేంద్రవరం వెళ్లేవారు, రాజమహేంద్రవరం నుంచి మండపేట అనపర్తి వైపు వచ్చే వాహనాలు కేశవరం ఊరిలో నుంచి పంచాయతీరాజ్ రోడ్డు మీదగా జెడ్ మేడపాడు, ద్వారపూడి ఫ్లైఓవర్ మీదుగా రాకపోకలు సాగించారు.

# తేరుకు రక్షణ ఈ తీరునా?


సత్యదేవుని రథోత్సవం (ఫైల్)


రథోత్సవం అనంతరం పంపాసత్రం ఆవరణలో కొలువై ఉన్న రథం


ఈఓ కార్యాలయం వద్ద ఉంచిన స్వామివారి ఊరేగింపునకు వినియోగించే వెండి వాహనాలు

- గతం నుంచి పాఠాలు నేర్వని అధికారులు
- రూ.1.08 కోట్ల వ్యయంతో నిర్మించిన సత్యరథానికి రత్నగిరిపై స్థలమే కరవు
- ఇక్కడ కాదని అక్కడ.. అక్కడ కాదని ఇంకోచోట..
- ఇంకా ప్రతిపాదనల స్థాయిలోనే షెడ్డు నిర్మాణం

**అన్నవరం:** రత్నగిరీశుడైన సత్యదేవుడు, అనంతలక్ష్మీ, సత్యవతీదేవి అమ్మవార్లను ఊరేగించేందుకు రూ.1.08 కోట్ల వ్యయంతో టేకు కలపతో 36 అడుగుల ఎత్తైన రథాన్ని నిర్మించిన దేవస్థానం దాని రక్షణకు ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సత్యదేవుని దివ్య కల్యాణ మహోత్సవాలలో భాగంగా ఈనెల 22వ తేదీన స్వామి, అమ్మవార్లను ఆ రథంపై ఘనంగా ఊరేగించిన విషయం తెలిసిందే.

ఊరేగింపు అనంతరం అదే రోజు రాత్రి ఆ రథాన్ని పంపా సత్రం వద్దకు తీసుకువెళ్లి ఉంచారు. అక్కడ నిలిపిన తరువాత రెండు సార్లు వర్షం కురిసింది. 24వ తేదీన సుమారు మూడు గంటల పాటు భారీ వర్షం కురిసింది. ఆ వర్షానికి ఈ రథం పూర్తిగా తడిసిపోయింది. ఆ తరువాత ఎండలు కాస్తుండడంతో రథం పరిస్థితి వానకు తడవడం, ఎండకు ఎండడంలా తయారైంది.

**రథం భద్రత ప్రశ్నార్థకం**

ప్రస్తుతం పంపా సత్రం ఆరుబయట ఉన్న రథం భద్రత కూడా ప్రశ్నార్థకంగా మారింది. 2020 సెప్టెంబర్ నెలలో అంతర్వేది దేవస్థానంలో స్వామివారి ఊరేగింపు రథం అగ్నిప్రమాదంలో దగ్ధమవడంతో రాష్ట్రంలోని అన్ని దేవస్థానాల రథాలకు, ఊరేగింపు వాహనాలకు రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాదిపదికన రక్షణ ఏర్పాట్లు చేసింది. ఇక్కడి స్వామివారి ఊరేగింపు వాహనాలను కూడా హుటాహుటిన రత్నగిరికి తరలించారు. తరలించే వీలు లేని రావణబ్రహ్మ వాహనం, పొన్నచెట్టు వాహనం ఉన్న షెడ్డుకు ఇనుప షట్టర్లు ఏర్పాటు చేసి సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేశారు.

ఆ అనుభవంతో సాధ్యమైనంత త్వరగా రథానికి షెడ్డు నిర్మించి భద్రపరచాల్సి ఉంది. అలాగే రథానికి షెడ్డు నిర్మించేవరకు ఎండా, వానల నుంచి రక్షణకు కనీసం దళసరి టార్పాలిన్ లాంటిది కప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కానీ అటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు.

**షెడ్ నిర్మాణానికి స్థలమే కరువా?**

అయితే ప్రస్తుతం ఈ రథాన్ని ఈ విధంగా రత్నగిరికి తరలించడం సాధ్యం కాదు. అందువల్ల కొండదిగువన రథం కోసం షెడ్డు నిర్మించాల్సి ఉంది. గతంలో ఈ రథం కోసం ఆర్యవైశ్య సత్రం ఎదురుగా గల కొండను తొలిచి అక్కడ షెడ్డు నిర్మించాలని, కాకుంటే పంపా సత్రం వద్ద నిర్మించాలని భావించారు.

ప్రస్తుతం దేవస్థానం మొదటి టోల్‌గేట్ సమీపంలోని గ్యారేజ్ వద్ద ఈ షెడ్డు నిర్మించాలని భావిస్తున్నట్లు సమాచారం.

అయితే రథోత్సవం ప్రారంభయ్యే తొలిపావంచాకు దగ్గరగా గల పాత ఈఓ క్వార్టర్స్ స్థలంలో కాని, లేదా సత్యనికేతన్ వెనుక గల ఖాళీ స్థలంలో కాని రథం భద్రతకు షెడ్డు నిర్మిస్తే బాగుంటుందన్న పలువురు అభిప్రాయపడుతున్నారు. పంపా సత్రం లేదా, గ్యారేజీ వద్ద షెడ్డు నిర్మిస్తే అక్కడ నుంచి తొలిపావంచా వద్దకు రథం లాక్కుని రావడం, ఊరేగింపు అయ్యాక మళ్లీ అక్కడకు తీసుకువెళ్లడం చాలా కష్టంతో కూడుకున్న పని. వందలాది మంది లాగితే తప్ప రథం కదలని పరిస్థితి.

> **రథానికి షెడ్డు నిర్మిస్తాం..**
>
> 
>
> సత్యదేవుని రథానికి షెడ్డు నిర్మించాలని నిర్ణయించాం. త్వరలోనే ట్రస్ట్ బోర్డు సమావేశంలో ఎక్కడ నిర్మించాలనే దానిపై చర్చిస్తాం. దేవస్థానం గ్యారేజీ స్థలం వద్ద షెడ్డు నిర్మిస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. షెడ్డు నిర్మాణం పూర్తయ్యేవరకు రథం వర్షానికి తడవకుండా, ఎండకు ఎండకుండా కవర్ కప్పాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించాము. రథానికి నాలుగు వైపులా సీసీ టీవీ కెమెరాలు కూడా అమర్చుతున్నారు.
>
> – కె.రామచంద్రమోహన్, ఈఓ, అన్నవరం దేవస్థానం

## తేనెటీగల దాడిలో 20 మందికి గాయాలు


తేనెటీగల దాడిలో గాయపడిన క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో సీహెచ్‌సీకి తరలిస్తున్న దృశ్యం


పి.గన్నవరం సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న ఉపాధి కూలీ

**పి.గన్నవరం:** మండలంలోని నరేంద్రపురంలో పంట కాలువ పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి కూలీలపై మన్యం తేనెటీగలు దాడి చేశాయి. ఈ దాడిలో గాయపడిన 20 మంది కూలీలను స్థానిక సీహెచ్‌సీకి తరలించి వైద్యం చేశారు. నరేంద్రపురం శివారు బూరుగుగుంట హేబిటేషన్ పరిధిలోని పంట కాలువలో 192 మంది కూలీలు పూడిక తీస్తున్నారు. వారిలో ఒక బృందంపై తేనెటీగలు తాడి చేయడంతో గాయపడిన వారిని స్థానికులు, తోటి సిబ్బంది, ఏపీఓ సీహెచ్.లక్ష్మీనారాయణ స్థానిక సీహెచ్‌సీకి ఆటోలు, 108 అంబులెన్స్‌లో తరలించారు. వైద్యాధికారి యు.రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది క్షతగాత్రులకు వైద్య సేవలు అందించారు. వారిలో భీమవరపు యశోద పరిస్థితి విషమించడంతో ఆమెను అమలాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎంపీడీఓ సీహెచ్.త్రిశూలపాణి క్షతగాత్రులను పరామర్శించారు.

**అంత్యక్రియలకు వెళ్లిన 8 మందిపైనా..**

**అంబాజీపేట:** స్థానిక హడ్కోకాలనీ సమీపంలోని శ్మశానవాటికకు అంత్యక్రియలకు వెళ్లినవారిపై తేనెటీగలు దాడి చేయడంతో ఎనిమిది మంది గాయపడ్డారు. కొర్లపాటివారిపాలేనికి చెందిన కోటిపల్లి సత్యవతి (84) మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు బుధవారం దహన సంస్కారాలకు శ్మశానానికి తీసుకువెళ్లారు. దహన సంస్కారం అనంతరం అక్కడి రావిచెట్టుపై ఉన్న తేనెపుట్ట నుంచి ఒక్కసారిగా తేనెటీగలు వచ్చి వారిపై దాడి చేశాయి. దీంతో వారంత అర కిలోమీటరు దూరం పరుగులు తీశారు. క్షతగాత్రులను స్థానిక అంబాజీపేట పీహెచ్‌సీకి తరలించగా వైద్యాధికారి బి.కె.శ్రీనివాస్, స్టాఫ్ నర్స్ విజయ వైద్యం అందిచారు

# వీడిన మహిళ హత్య మిస్టరీ

- ప్రైవేట్ కంపెనీలో ప్రొడక్షన్ మేనేజరే హంతకుడు
- బలంగా గొంతు నొక్కడం వల్లే ఊపిరాడక మృతి


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ సీఐ ఎస్‌వీవీఎస్ మూర్తి


హత్య అనంతరం మహిళ మృతదేహాన్ని తరలించిన వాహనం


కొర్రా కుమారి (ఫైల్)

**తుని రూరల్:** తుని మండలం తేటగుంట శివారు టి.వెంకటాపురం గ్రావెల్ రోడ్డులో గుర్తు తెలియని మహిళ హత్య కేసు మిస్టరీ విడింది. అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి మండలం నక్కలమెట్ట గ్రామానికి చెందిన కొర్రా కుమారి (28) హత్యకు గురైనట్టు రూరల్ పోలీసులు గుర్తించారు. హత్యకు గల కారణాలను బుధవారం తుని రూరల్ సర్కిల్ కార్యాయంలో సీఐ ఎస్‌వీవీఎస్ మూర్తి విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. రూరల్ సీఐ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. కొర్రా కుమారి కొంతకాలంగా తునిలో నివాసం ఉంటూ ఆర్టీసీ కాంప్లెక్సు, రైల్వే స్టేషన్ల మధ్య తిరుగుతూ గుట్టుగా జీవనోపాధి పొందుతోంది. తెలంగాణ రాష్ట్రం మధిరకు చెందిన నందిగం ప్రవీణ్ అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం కేశవరంలో ఉన్న డెక్కన్ కంపెనీలో ప్రొడక్షన్ మేనేజరుగా పని చేస్తున్నాడు. పాయకరావుపేటలో ఉంటున్న ప్రవీణ్ ఆ రోజు తన భార్య ఆమె బంధువుల ఇంటికి మరో ఊరు వెళ్లడంతో అతడు మద్యం తాగి అప్పటికే పరిచయం ఉన్న కొర్రా కుమారిని ఆ రోజు రాత్రికి కొంత మొత్తం నగదు చెల్లించి ఇంటికి తెచ్చుకున్నాడు. లైంగిక వాంఛ తీర్చాలని బలవంతం చేయడంతో ఆమె కేకలు వేసింది. దీంతో ఆగ్రహించిన ప్రవీణ్ ఆమెను దవడపై బలంగా కొట్టాడు. దీంతో ఆమె మరింత గట్టిగా కేకలు వేసింది. చుట్టుపక్కల వారు వస్తారన్న అనుమానంతో ఆమె చేతులను, గొంతును గట్టిగా అదిమిపెట్టడంతో ఊపిరాడక ఆమె మృతి చెందింది. ఈ హత్య ఆనవాళ్లు తెలియకుండా చేసేందుకు ప్లాస్టిక్ టేపుతో చేతులను నడుముకు చుట్టి, మృతదేహానికి తెల్లటి దుప్పటి చుట్టి నలుపు రంగు ట్రావెల్ సూట్ కేసులో పెట్టి తన స్నేహితుడి స్కూటీ మధ్య భాగంలో కాళ్ల దగ్గర పెట్టుకుని జాతీయ రహదారిపై పాయకరావుపే నుంచి తుని, జగన్నాథగిరి, వి.కొత్తూరు మీదగా రాజులు కొత్తూరు సమీపంలోగల టి.వెంకటాపురం గ్రావెల్ రోడ్డుకు చేరుకున్నాడు. నిర్మానుష్యంగా ఉన్న గ్రావెల్ రోడ్డులో ఆ మృతదేహాన్ని పడేసి తిరిగి తన నివాసానికి వెళ్లిపోయాడు. 19న ఉదయం అటుగా వెళ్లే స్థానికుల సమాచారంతో తేటగుంట-2 వీఆర్వో వద్దాది సత్యనారాయణ రూరల్ పోలీస్‌కు ఫిర్యాదు చేశాడన్నారు.

**దర్యాప్తు సాగిందిలా..**

గుర్తు తెలియని మహిళ హత్యగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ ఆదేశాలతో డీఎస్పీ కె.లతాకుమారి పర్యవేక్షణలో రూరల్ సీఐ ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు ప్రారంభించారు. తుని రూరల్, కోటనందూరు, తుని పట్టణం, కోరంగి ఎస్సైలు రమేష్ బాబు, శంకరరావు, విజయబాబు, రవికుమార్, పెద్దాపురం సబ్ డివిజన్ పోలీసులు, సాంకేతిక సిబ్బందితో కేసును చేధించారు. హత్యకు పాల్పడిన ప్రవీణ్‌ను మంగళవారం మధ్యాహ్నం తుని మండలం ఎర్రకోనేరు సమీపంలో అరెస్టు చేసినట్టు సీఐ మూర్తి వివరించారు. స్కూటీ, ట్రావెల్ సూట్‌కేసు, ప్లాస్టిక్ టేపును స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు. కేసు పురోగతికి కృషి చేసిన ఎస్సైలకు, పోలీసులకు, సాంకేతిక సిబ్బందికి సీఐ నగదు రివార్డులను సీఐ అందజేశారు.



## 260.72 కిలోల గంజాయి స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయి, అరెస్టు చేసిన నిందితులతో సెబ్ సౌత్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ హనుశ్రీ

- నర్సీపట్నం నుంచి చెన్నైకి రవాణా
- గూడ్స్ వ్యాన్, సెల్‌ఫోన్లు, నగదు స్వాధీనం
- నలుగురి అరెస్టు

**రాజమహేంద్రవరం రూరల్:** నర్సీపట్నం నుంచి తమిళనాడు రాష్ట్రం చెన్నైకు గంజాయి తరలిస్తున్నారన్న సమాచారంతో మంగళవారం రాత్రి సెబ్ సౌత్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ, సిబ్బందితో దివాన్‌చెరువు జీరో పాయింట్ వద్ద తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ఏపీ07 టీఎఫ్ 1136 నెంబరు గల గూడ్స్ వెహికల్‌లో 260.072 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని తమిళనాడుకు చెందిన ఎస్.ఆనందవేలు, ఎస్.మురుగన్, కిషోర్‌కుమార్, మహిందర్‌లను అదుపులోకి తీసుకుని వారి నుంచి ఐదు సెల్‌ఫోన్లు, రూ.3 వేలను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. నర్సీపట్నం ఏజెన్సీ ప్రాంతంలో గంజాయిని కొనుగోలు చేసి తమిళనాడుకు తరలిస్తున్నారన్నారు.

స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ ఇక్కడి లెక్కల ప్రకారం రూ.15.74 లక్షలని, తమిళనాడులో దాని విలువ రూ.38.10 లక్షలు ఉంటుందన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో చింతపల్లి, పాడేరులో గిరిజన గ్రామాల నుంచి తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ తెలిపారు. ఈ దాడులలో ఎస్సై వై.దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

**సారా, మద్యం సీసాలతో..**

**మధురపూడి:** కోరకొండ సెబ్ కోరుకొండ సర్కిల్ కార్యాలయం పరిధిలో 200 లీటర్ల నాటు సారా, 80 మద్యం సీసాలతో పలువురు వ్యక్తులను బుధవారం అరెస్టు చేసినట్టు సీఐ బంగారు రాజు తెలిపారు. గోకవరం మండలం కామరాజుపేట, తిరుమలాయపాలెం, గోకవరం గ్రామాల్లో సీతానగరం మండలం రఘుదేవపురం, కాటవరం గ్రామాల్లో బుధవారం దాడులు నిర్వహించినట్టు తెలిపారు. ఈ గ్రామాలకు చెందిన సంగుల శివప్రసాద్, వనుం నాగమణి, బొందెల అప్పారావు, నీలం వీరబాబు తదితరులను అదుపులోకి తీసుకున్నామని, వారి నుంచి 200 లీటర్లు నాటు సారా, 80 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపర్చినట్టు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్సై వంశీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

## వేద విద్య కాలాతీతం

- టీటీడీ వేదిక్ వర్సిటీ వేద భాష్య ఆచార్యులు ఫణియాజులు


గంగలకుర్రులో వేద పట్టాలు పంపిణీ చేస్తున్న పండితులు

**అంబాజీపేట:** తరాలు మారుతున్నా వేద విద్య కొనసాగుతూనే ఉంటుందని టీటీడీ వేదిక్ యూనివర్సిటీ వేద భాష్య ఆచార్యులు దువ్వూరి యజ్ఞేశ్వర ఫణియాజులు ఉద్ఘాటించారు. మండలంలోని గంగలకుర్రులో మూడు రోజులుగా జయంతి భాస్కర సుబ్రహ్మణ్యం స్వగృహంలో జరిగిన శ్రీ గోదావరి మండల వేద శాస్త్ర ప్రవర్ధక సభ చారిటబుల్ ట్రస్ట్ 73వ వార్షికోత్సవాలు బుధవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా నిర్వహించిన వేద విద్వత్ మహాసభకు ట్రస్ట్ అధ్యక్షుడు చిట్టావఝుల వెంకట సూర్యనారాయణమూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఫణియాజులు మాట్లాడుతూ వేదాన్ని సేవించినంత కాలం సమాజ స్థాపన జరుగుతూనే ఉంటుందన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పి.కె.రావు మాట్లాడుతూ మానవ మనుగడకు వేదాలే మూలమన్నారు. తొలుత సుమారు 300 మంది వేద పండితులు నిర్వహించిన వేద స్వస్తితో గ్రామం వేద ఘోషతో పులకరించింది.

**17 మందికి వేద పట్టాల పంపిణీ**

గత మూడు రోజులుగా నిర్వహించిన వేద పరీక్షలలో 17 మందికి పూర్తి స్థాయి వేద పట్టాలు పంపిణీ చేసినట్టు ట్రస్ట్ కార్యదర్శి ఆకెళ్ల వెంకట రామకృష్ణ కామేశ్వర శర్మ, సహాయ కార్యదర్శి యేడిద సుబ్రహ్మణ్య శర్మ తెలిపారు. కార్యక్రమంలో టీటీడీ సూపర్ వైజర్ గుళ్లపల్లి దత్తాత్రేయ ఘనాపాఠి, కడియాల సీతారామ వధాని, ట్రస్ట్ కోశాధికారి అయ్యగారి లక్ష్మీనరసింహ మూర్తి, సహాయ కార్యదర్శి భమిడిపాటి యజ్ఞేశ్వర ప్రసాద్, వేదపండితులు కర్రా దత్తు, ఆకెళ్ల నారాయణమూర్తి పాల్గొన్నారు.

## లారీ ఢీకొనడం వల్లే ప్రమాదం

- కోడూరుపాడు ప్రమాద ఘటనలో కీలక మలుపు
- సీసీ టీవీ ఫుటేజ్‌ల ఆధారంగా కేసు పురోగతి


ప్రమాదంలో నుజ్జయిన కారు

**హనుమాన్‌జంక్షన్ రూరల్:** చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారిపై బాపులపాడు మండలం కోడూరుపాడు వద్ద ఈ నెల 27న జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై పోలీసుల దర్యాప్తు కీలక మలుపు తిరిగింది. ఈ ప్రమాదంలో తమిళనాడుకు చెందిన ఓకే కుటుంబంలోని నలుగురు దుర్మరణం చెందగా, మరొకరు ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చేరారు. అతి వేగమే ఈ ఘటనకు కారణమని ప్రాథమికంగా గుర్తించినా వీరవల్లి పోలీసుల దర్యాప్తులో అసలు వాస్తవాలు వెలుగులోకి చూస్తున్నాయి. తమిళనాడులోని దిండిగల్ జిల్లా వేదసంతూర్‌కు చెందిన స్వామినాథన్ కుటుంబం పదేళ్లుగా తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులోని అడ్వకేట్ కాలనీలో నివసిస్తున్నారు. స్థానికంగా ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్న స్వామినాథన్ తమిళనాడులోని సొంతూరులో ఓ శుభకార్యానికి కుటుంబంతో కారులో వెళ్తుండగా బాపులపాడు మండలం కోడూరుపాడు సమీపంలోని పెట్రోలు బంకు వద్ద ఐదో నంబర్ జాతీయ రహదారిపై ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో కారు నుజ్జయ్యి డ్రైవింగ్ చేస్తున్న స్వామినాథన్ (40), అతని కుమార్తె రాధా ప్రియ (14), కుమారుడు రాకేష్ (12), సోదరుడి కుమారుడు గోపి (23) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. కారులో ప్రయాణిస్తున్న స్వామినాథన్ భార్య సత్య (38) తీవ్ర గాయాలతో విజయవాడలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు.

**టైరు గుర్తులతో..**

ఘటనాస్థలాన్ని ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ, గన్నవరం డీఎస్పీ ఆర్.జయసూర్య, ట్రైనీ డీఎస్పీ వేదశ్రీ పరిశీలించిన తరుణంలో పలు ఆసక్తికర విషయాలు చర్చకు వచ్చాయి. ప్రమాదస్థలి వద్ద లారీ టైరు గుర్తులు కనపడడంతో అనుమానించి సమీపంలోని సీసీ ఫుటేజీని, ఆత్కూరు టోల్‌గేట్ సీసీ టీవీ ఫుటేజీను పరిశీలించారు. గేదేలు లోడుతో వెళ్తున్న లారీ అతి వేగంగా కారును ఢీకొనడం వల్లే కారు అదుపుతప్పి డివైడర్‌ను దాటి ఆవైపు రోడ్డులో ఎదురుగుగా వస్తున్న లారీని ఢీకొన్నట్టు తేలింది. కాగా జాతీయ రహదారిపై చిలకలూరిపేట సమీపంలో ఆ లారీని నిలిపి డ్రైవర్ పరారైనట్టు పోలీసులు గుర్తించి లారీని అదుపులోకి తీసుకున్నారు.

## వుడయార్‌కు 'అంబేడ్కర్ ఎక్సెలెన్సీ'


శిల్పి రాజ్‌కుమార్ వుడయార్

**కొత్తపేట:** ప్రముఖ అంతర్జాతీయ శిల్పి డి.రాజ్‌కుమార్ వుడయార్ హైదరాబాద్ కళానిలయం కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ వారి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎక్సలెన్సీ అవార్డుకు ఎంపికయ్యారు. తద్వారా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదయ్యారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలకు అత్యధిక సంఖ్యలో అంబేడ్కర్ విగ్రహాలు నిర్మించినందుకు గుర్తుగా ఆ సంస్థ ఆయనను ఈ పురస్కారానికి ఎంపిక చేసింది. అంబేడ్కర్ 133వ జయంతి వేడుకల్లో భాగంగా గురువారం సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలో వుడయార్‌కు పురస్కారం ప్రదానం చేయనున్నారు. ఈ మేరకు ఆ విషయాన్ని స్థానిక విలేకరులకు ఆయన తెలిపారు.

**2 వేల అంబేడ్కర్ విగ్రహాల రూపకల్పన**

తాను రూపొందించిన సుమారు 3,500 జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు, చరిత్రకారులు, రాజకీయ నాయకులు, సంఘ సంస్కర్తల విగ్రహాల్లో సుమారు 2 వేలు వరకూ అంబేడ్కర్ విగ్రహాలే ఉన్నాయని శిల్పి రాజ్‌కుమార్ తెలిపారు. అనేక వర్సిటీలతో పాటు ఇతర రాష్ట్రాల్లోని వర్సిటీలు, ఇతర సంస్థల్లో తాను రూపొందించిన అంబేడ్కర్ విగ్రహాలు ఉన్నాయన్నారు. 1950లో స్టూడెంట్‌గా ఉన్న తన తండ్రి, అప్పటి యువ శిల్పి శ్రీనాథ రత్నశిల్పి వుడయార్‌ను ఢిల్లీలో అంబేడ్కర్ చేతులు మీదుగా బెస్ట్ యువశిల్పి అవార్డుతో సత్కరించారని రాజ్‌కుమార్ గుర్తు చేసుకున్నారు. అలాగే తనను సైతం అంబేడ్కర్ మనుమడు ప్రకాష్ అంబేడ్కర్ సత్కరించారని తెలిపారు.

## జాతీయ లోక్ అదాలత్‌పై సమావేశం

**కంబాలచెరువు(రాజమహేంద్రవరం):** వచ్చే నెల 29న ఉమ్మడి జిల్లాలో జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌పై జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత బుధవారం సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ న్యాయవాదులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత మాట్లాడుతూ వచ్చే నెలలో జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో సివిల్ కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, మోటారు వాహనాల యాక్సిడెంట్, చెక్ బౌన్స్, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని కేసులను గుర్తించి, ఆ జాబితాను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందజేయాలన్నారు. అనంతరం జాతీయ లోక్ అదాలత్‌పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.